క్లుప్తంగా

కూలీలకు రక్షణ కల్పించండి



అయిజ: అధికారులు ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ కోరారు. మంగళవారం మండలంలోని బింగుదొడ్డి శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్, సంజీవరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ధరూరు: ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ వచ్చేటట్లు చూడాలని ఉపాధ్యాయులను ఎంఈఓ రవీంద్రబాబు ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని సోంపురం గ్రామంలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మూత్రశాలలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా, రాయచూర్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి పలువురికి జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న బహిరంగ వేలం

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో పూజా సామగ్రిని విక్రయించే షాపునకు ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

కూచిపూడిలో చిన్నారి ప్రతిభ



శాంతినగర్: కూచిపూడి నృత్యంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ పైపాడుకు చెందిన చిన్నారి జ్ఞాపిక ఉత్తమ ప్రతిభ కనబరుస్తుంది. మంగళవారం యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి పుణ్యక్షేత్రంలో నృత్య ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా పలువురు చిన్నారిని అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యురాలు హేమమానస ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలన్నారు. 18 మందికి పరీక్షలు నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రన్న, తిరుమల్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

అయిజ: అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులను మంగళవారం స్థానిక పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, వీరేష్, రాజు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

శాంతినగర్: వడ్డేపల్లి మండలం తనగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన గడ్డం తిమ్మప్ప మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకావొద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు గోపాల్, కృష్ణయ్య, కురుమూర్తి, విద్యార్థి నాయకులు శేఖరాచారి, జయరాముడు, అమీర్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాండవిస్తున్న సమస్యలు

- చెత్తకుప్పలతో దర్శనమిస్తున్న గ్రామాలు
- అలంకారప్రాయంగా నల్లా కనెక్షన్లు
- కరువైన అధికారుల పర్యవేక్షణ



చిన్న ఆముదాలపాడులో ఇళ్ల మధ్యలో చెత్తకుప్పలు

ఉండవెల్లి: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి మాట అటుంచి నిత్యం సమస్యలతో అల్లాడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. సర్పంచ్‌లు లేకపోవడం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఎక్కడి సమస్యలే అక్కడే పాతుకుపోయాయి అంటున్నారు. మండలంలో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, నల్లా సమస్యలు ఇలా అనేక సమస్యలతో అల్లాడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే డ్రెయినేజీ నిండి రోడ్లపై మురుగుపారుతుందని, దోమల బెడదతో అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఎద్దడి అధికం..

మిషన్ భగీరథ నీరు ట్యాంకులకు కూడా రావడం లేదని, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరధిలోని ప్రాగటూరు, కంచుపాడు, ఉండవెల్లి, తక్కశీల గ్రామాల్లో కొన్ని వార్డుల్లో నీరు రాక అల్లాడిపోతున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా బోర్లకు మరమ్మతులు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. డ్రెయినేజీ నిండి రోడ్లపై మురుగు పారుతుందని, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుందని దీంతో మహిళలు, చిన్నారులు ఆస్పత్రులు పాలవుతున్నట్లు పేర్కొన్నారు.

వేధిస్తున్న నిధుల సమస్యలు..

గ్రామాల్లో పనులు చేయాలంటే నిధులు కావాలి. నిధులు వస్తే కార్మికులు పనులు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు జీతాలు కూడా అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. గతేదాది నవంబర్, డిసెంబర్ నుంచి జీతాలు అందడం లేదని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిలకు కార్మికులు విన్నవించారు. పుల్లూరు గ్రామ పంచాయతీల్లో నవంబర్, డిసెంబర్, జనవరి నెలలో కార్మికులకు జీతాలు వేసినట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చారని కానీ సూపర్‌వైజర్ సంతకాలు చేయించి జీతాలు ఇవ్వలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

గ్రామ పంచాయతీల్లో అధికారుల పర్యవేక్షణ కరువవడంతో సమస్యలు పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యదర్శులు ఎందుకు వస్తున్నారో ఎందుకు వెళ్తున్నారో తెలియడం లేదంటున్నారు. కనీసం గ్రామసభలు కూడా నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. కార్యదర్శులు ఫోటోలు తీసుకుని తీసుకుని గ్రూపుల్లో పోస్ట్ చేసి పనులు చక్కబెడుతున్నట్లు విమర్శిస్తున్నారు.



మారమునగాలలో డ్రెయినేజీలో నిలిచిన మురుగు

అనేక సమస్యలు



కంచుపాడు గ్రామంలో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదు. సమస్యలు తెలిపినపుడు పరిశీలిస్తామంటున్నారు. ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి.

- సత్యారెడ్డి, కంచుపాడు

డ్రెయినేజీతో ఇబ్బందులు



డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నా నిర్వహణ సరిగా లేక మురుగు అలాగే నిలిచిపోతుంది. గ్రామంలో దోమలు, ఈగలు, దుర్వాసన వెలవడుతుంది. డ్రెయినేజీల్లో మురుగు తొలగించి, వ్యాధుల బారిన పడకుండా చూడాలి. ముఖ్యంగా చెత్త సమస్య నుంచి గ్రామాలను రక్షించాలి.

- రఫీక్, మారమునగాల

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. పారిశుద్ధ్య సమస్యలు వేధిస్తున్నట్లు ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. కార్యదర్శులు సమయపాలన పాటించేలా పర్యావేక్షిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాకా కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు.

- తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

వృద్ధులపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



గాయపడిన వృద్ధులు

గద్వాల క్రైం: ఇద్దరు వృద్ధులపై గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన మండలం చేనుగోనిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ సోమేశ్వరిమ్మ, రాములు భిక్షాటన చేస్తు జీవనం సాగిస్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధులపై విచక్షణ రహితంగా దాడి చేసినట్లు తెలిపారు. రాములుపై గాజు సీసాలతో దాడి చేయగా, వృద్ధురాలి తల, ముక్కు, శరీర భాగాలపై తీవ్రంగా గాయపరిచారు. వృద్ధులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చేలోపు దాడి చేసిన వారు పరారైనట్లు తెలిపారు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

జిల్లాలో ఇసుక కొరతను నివారించండి



టీజీఎండీసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

అలంపూర్: జిల్లాలో ఇసుక కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడు మహ్మద్ ఇస్మాయిల్ కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మినరల్ అభివృద్ధి కార్పొరేషన్ (టీజీఎండీసీ) చైర్మన్ ఈరవర్తి అనిల్ కుమార్‌ను రాష్ట్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, జిల్లా రోడ్డు రవాణ శాఖ అథారిటీ సభ్యుడు పల్లి సతీష్‌కుమార్ మంగళవారం కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఇసుక కొరత అధికంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుక కొరతతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నట్లు తెలిపారు. ఇసుక కొరత నివారణకు తుమ్మిళ్ల రీచ్‌ను త్వరగా ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.

సిబ్బంది మానవత్వంతో సేవలందించాలి



అయిజలో 108 సిబ్బందితో క్వాలిటీ ఆడిటర్ కిషోర్

అయిజ: 108 వాహన సిబ్బంది మానవత్వంతో సేవలందించాలని రాష్ట్ర క్వాలిటీ ఆడిటర్ కిషోర్ అన్నారు. 108 డిస్టిక్ కోఆర్డినేటర్ రత్నమయ్యతో కలిసి మంగళవారం మండల కేంద్రంలో 108 వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ 108 సిబ్బందితో మాట్లాడారు. సమయస్ఫూర్తితో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది శ్రీధర్, ఇజ్రాయిల్, నవీన్, రవి, కృష్ణ వర్మ పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

గట్టు: ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ అధికారి కిషోర్, డాక్టర్ రమేష్, జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్య మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, అంబులెన్స్‌లో ఉన్న మందులు పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ..మండల ప్రజలు 108 సేవలను వినియోగించుకోవాలన్నారు. 24 గంటలు 108 సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



గట్టు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

మానవపాడు/ధరూరు/గట్టు: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరీక్షల తనిఖీ అధికారి హృదయరాజ్ అన్నారు. మానవపాడు మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. 147 మంది విద్యార్థులకు గానూ 146మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు మొత్తం 350 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.
- గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షకు 287 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీవిశ్వనాథ్ తెలిపారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి

రాజోళి: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నీటి సమస్యను ఎదుర్కొన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



గట్టు: మండల పరిధిలోని చాగదోన ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేసి ఆకట్టుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమస్యలు తలెత్తొద్దు

కేటీదొడ్డి: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి



అయిజ: రక్తదానం చేసి రోగుల ప్రాణాలు కాపాడాలని తహసీల్దార్ జ్యోతి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాహేర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ జ్యోతి రిబ్బన్ కట్‌చేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. మొత్తం 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

బాల్యాన్ని బడిలోనే గడపాలి



ఆలూరులో మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత



రాజోళిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఖాజామెయినుద్దీన్

గట్టు : బాల్యాన్ని బడిలోనే గడిపే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని, వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాలని మల్దకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమలత అన్నారు. మంగళవారం ఆలూరు గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. బాల సంరక్షణ కమిటీలు గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి వరకు ఉంటాయని తెలిపారు. బాలలపై ఏ విధమైన వేధింపులు, అకృత్యాలు, హింస జరుగకుండా ఉండడంతో పాటుగా పిల్లలంతా ఆనందంగా ఉండేలా మార్చడం కమిటీల బాధ్యతన్నారు. బాలలపై ఎలాంటి వేధింపులు జరుగకుండా చూడడం, బాల్య వివాహాలను అరికట్టడం, పిల్లలను పనుల్లో పెట్టుకుండా చూడడం కమిటీల బాధ్యతని తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహా మాట్లాడుతూ.. బాల్యం పిల్లల హక్కని, స్వేచ్ఛాయుత వాతవరణంలో పెరిగే విధంగా సహకారం అందిద్దామని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దామన్నారు. బాలలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపుల రక్షణకు 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి, కార్యదర్శి ఇజాజ్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పలత, హెచ్ఎం బుడ్డన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాలలను వేధిస్తే చర్యలు..

మానవపాడు: బాలలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణ కమిటీ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లెపాడు యూపీఎస్ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, విలేజ్ సెక్రటరీ శ్రవణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేష్, నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి

రాజోళి: బాలల భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బాలల సంరక్షణ అధికారుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. వలస వెళ్లిన వారు, డ్రాప్‌ఔట్, బాల కార్మికుల వివరాలు గుర్తించాలన్నారు. వారిని పాఠశాలలో చేర్పించడం, వసతులు కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి, డాక్టర్ మధుబాబు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ బిల్లుల ఆమోదంపై హర్షం



అయిజలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గద్వాల: రాష్ట్ర శాసనసభ సమావేశంలో బీసీ, ఎస్సీ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మంగళవారం స్థానిక పాత బస్టాండ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, విజయ్, సుభాన్, మురళి, ఆంజనేయులు, రమేష్, మధు, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

అయిజ: అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణను ఆమోదించిన సందర్భంగా మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్, అంజిబాబు, ఏయన్న, ప్రకాశం, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ధరూరు ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు

గద్వాల/గట్టు/ధరూరు/మల్దకల్/శాంతినగర్/మానవపాడు/కేటీదొడ్డి: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల దశలో ఉపాధ్యాయులు నేర్పే పాఠాలు, సంస్కారం, విజ్ఞానం నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు బాటలు పడుతాయన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ, ఉన్నత పాఠశాల హెచ్ఎం నల్లారెడ్డి, గట్టు ఎస్ఐ కేటీ మల్లేష్ అన్నారు. గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొన్నారు. మండల టాపర్‌కు రూ.10,016 నగదు బహుమతి అందజేస్తానని ఉపాధ్యాయుడు రాజుసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలూరు హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు నర్సింహులుగౌడ్, నర్సింహులు, పరుశరాం, రమేష్, రాముడు, సుజాత, వెంకటేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.
- విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మానవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్, మద్దిలేటి, యోగీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.
- కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం, కొండాపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రజుమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి , ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రేవులపల్లిలో..

- విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైందని మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ధరూరు ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు.
- విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ సూచించారు. మల్దకల్, కుర్తిరావల్‌చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శేషంపల్లి నర్సింహులు, హెచ్ఎం క్రాంతికుమార్, రాజేశ్వర్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- విద్యార్థులు ఇష్టంతో చదివితేనే మంచి మార్కులు సాధిస్తారని వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహులు అన్నారు. పదో తరగది విద్యార్థుల వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధిని కళాశాల యాజమాన్యం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రామాపురం పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



మల్దకల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు